# అత్తా కోడళ్ల హంగామా

'అత్తయ్యా ! మావయ్య పేరు రాఘవ గదా ! ఆ పేరు మా పాఠములో ఉంది తెల్సా !' ఉదయమే తెలుగు పాఠము వల్లెవేస్తున్న చిన్నారి అనిత మేనత్తతో గర్వంగా చెబుతుంది.

అప్పుడే తలస్నానం చేసొచ్చిన స్వప్న - నీరోడుతున్న పొడగాటి జుట్టును తుండు గుడ్డతో బంధిస్తూ వచ్చి అన్న కూతురు పక్కన కూచుంది. మూడో తరగతి పాఠ్య పుస్తకములో 'సీతా కల్యాణం' చదువుతూంటే స్వప్న చెంపలు కెంపులైనాయి. నాలుగు నెలల క్రితం మెడలో మూడుముళ్ళేసి వెంట ఏడడుగులు నడిపించుకున్న భర్త రాఘవ రూపం హృదయ ఫలకమ్మీద ప్రత్యక్షమైంది.

రేపే ఉగాది పండగ. మూన్నాల్గు రోజులు ముందుగా పుట్టింటి కొచ్చింది. మూడు రాత్రుల ముచ్చట్లు గుర్తుకొచ్చి మురిపాలలో ముంచేస్తుంటే, చూపులు శూన్యంలో కెల్తున్నాయి. అనిత అయోమయంలో మునిగింది.

చాయ కప్పులతో వస్తున్న తల్లితో 'చూడమ్మా ! మావయ్య పేరు చెప్తే అత్తయ్య అలాగైపోయిందే !'

మాధవి ఎర్రని పెదాల మీద తెల్లని చిరునవ్వు మెరిసింది. చాయ కప్పొకటి మరదలి కందించి 'ఓహో ! స్వప్న గారు స్వప్నలోకంలో విహరిస్తున్నారా ! మా తమ్ముడీ రోజే వస్తున్నాడు గదా ! రానీ... నీ పంజెప్తా !' చెక్కిలి మీద చిటికేసింది. తానూ పక్కన కూచుండి చాయ్ సిప్ చేస్తోంది.

వదిన మెడలోని చంద్రహారాలను చూస్తూ, జడలోని మల్లెల గుబాళింపు నాస్వాదిస్తూ చాయకప్పు పెదాల కానించుకుంది స్వప్న. రెండు గుక్కలు గొంతులోకి జారగానే చాయోత్సాహం పొంగుకొచ్చింది.

'ఛో వదినా !' ఖాళీ కప్పు వదిన కందిస్తూ చెక్కిలి పుణుక్కుంది. చిన్నారి అనిత అదంతా నాకెందుకులే అనుకుందేమో - పూజ ముగించుకుని ప్రసాదం ప్లేటుతో వస్తున్న నానమ్మ కెదురెల్లింది. ఓ సీతాకోక చిలుకెగిరొచ్చి నట్టనిపించింది నాన్నమ్మ అన్నపూర్ణకు.

'నానమ్మా ... నాకు ప్రసాదం !'

'నాగ్గూడా !' బుంగమూతితో చెయ్యిచాచింది స్వప్న.

'నానమ్మా ! నాకు అరటిపండు' అనిత గూడా చెయ్యి చాచింది పోటీగా.

'ఐతే ... నాకూ అరటిపండు' చిన్న పిల్లలా గారాలు పోయింది స్వప్న.

'హమ్మమ్మా ! అరటి పండు కోసం అత్తాకోడళ్లు పోటీ పడ్తున్నారా ?' పెదాల మద్య నవ్వు బిగపట్టిన మాధవి ఖాళీ కప్పులతో లేచినుంచుంది. మరదలు గారు మరీ చిన్న పిల్లై పోతున్నారు.' నెత్తిమీదో మొట్టికాయ వడ్డించింది. 'అంటే ... నీ కూతురుకు సపోర్టా ... చూడమ్మా !' స్వప్న గూడా లేచి నుంచుంది.

వరాల మూట మనవరాలు, గారాల కూతురు, కొంగుబంగారం లాంటి కోడలు... దృశ్యం కన్నులపండువులా కన్పించింది అన్నపూర్ణమ్మకు. మనసులోనే మనసారా నవ్వుకుంది.

'నా కూతురుకో కూతురు పుట్టే దాకా అది చిన్నపిల్లనే మాధవీ !' మురిసిపోతూ ముగ్గిరికి తలా ఓ అరటిపండు అందించింది.

'చూశావా బుజ్జీ ! మా అమ్మనాకు సపోర్టు !' కోడలును వెక్కిరిస్తూ కేరింతలు కొట్టింది స్వప్న.

'పాపం ! అంతవరదాకా నీ కూతురు నోట్లో వేలుపెడితే కొరకదు, వెన్న బెడితే నాకదు.' మరదలు గదవబట్టి పైకిలేపింది మాధవి.

'నానమ్మా ! నాకు సపోర్టు చెయ్యవా ?' అనిత అలకపాన్పు ఎక్కబోయింది.

'మా యమ్మే ! నా బంగారు కొండా ! నా సపోర్టు నీకెప్పుడూ ఉంటుందమ్మా!' మనవరాలి బుగ్గలు ముద్దాడింది.

'అయ్... నానమ్మ నా పార్టీయే !' అత్తను వెక్కిరిస్తూ లేడిపిల్లలా గంతులేసింది అనిత.

'ఇంకా మీ మధ్య నేనెందుకూ ? నాకు పనుంది' గొణుక్కుంటూ వంటింట్లోకెళ్లింది మాధవి. అన్నపూర్ణమ్మ తిరిగి పూజాగదిలో కెల్తూ 'అల్లుడు గారు ఇవ్వాళ్ల ఉదయమే వస్తారన్నావు గదా ! చూస్తుండు స్వప్నా !' కూతురును హెచ్చరించింది.

'సరేనమ్మా ! అంటూ అరటిపండు వొలిచి తొక్క బయటికి విసిరేసింది. తాను గూడా అలాగే చేసింది అనిత. తియ్యని అరటిపండు తింటూంటే కమ్మని కబుర్లు గుర్తుకొచ్చినై అత్తా కోడళ్లకు. అనిత అత్తయ్య పక్కన చేరింది.

'అత్తయ్యా ! మీ వరంగల్లులో వెయ్యి స్థంబాల గుడి ఉందట గదా !'

'ఉందమ్మా అందమైన ఆ గుడికి వెయ్యి స్తంభాలున్నై. ఎనిమిది వందల సంవత్సరాల చరిత్ర ఉంది. కాకతీయుల కళావైభవానికి మచ్చు తునక...' కళ్ళు తిప్పుతూ ఉత్సాహంగా చెబుతోంది స్వప్న.

'కాకతీయ అంటే తియ్యని చాక్లెట్టా, బిస్కెట్టా ?'

ఆ పిల్లకెలా చెబితే అర్థమవుతుందో ! కొద్దిపాటి అయోమయం. కాని చెప్పక తప్పదు. 'కాకతీయ అంటే చాక్లెట్టూ, బిస్కెట్టూ కాదు తల్లీ !'

'మరేమిటి తల్లీ ?' కనుగుడ్లు గచ్చకాయలైపోయినై.

'కాకతీయులంటే... అదొక రాజవంశం. ఆ వంశం రాజులు చాలా గొప్పవారు...' గణపతిదేవుని మూర్తిమంతం, రుద్రమదేవి రౌద్రం గురించి చెప్పేసి ప్రతాపరుద్రుని ప్రతాపం, అతడు కట్టించిన వెయ్యిస్తంభాల గుడి గురించి చెబుతోంది.

మోచేయి గదవ కానించుకుని ఆసక్తిగా వింటోంది అనిత.

'ఎంతో మంది శిల్పులు, కళాకారులు రాత్రింబవళ్లు కష్టపడి...'

'వామ్మో...' మెట్లమీదనుంచి గావు కేక. 'నాయనోయ్... అ.. అ...!' వాకిట్లోంచి మూల్గులు. అత్తా కోడళ్ల దృష్టి అటు పరుగెత్తింది.

'అయ్యయ్యో !... మావయ్యొచ్చాడు... మెట్లమీంచి పడిపోయాడత్తయ్యా !' తుర్రున బయటి కొచ్చింది అనిత.

స్వప్న గుండె ఝల్లుమంది. 'అయ్యయ్యో ! ఏమైందండీ ?' బయటికి పరుగెత్తుకొచ్చి రాఘవ భుజాలు పట్టుకుని లాఘవంగా లేవనెత్తింది.

'అరెరే... కొత్తఅల్లుడు అత్తారింట్లో అడుగు పెట్టకముందే అరటితొక్క స్వాగతం... బాగానే ఉందే ?' పక్కింటి యువకుని పరాచకం 'మా స్వప్నక్కయ్య గురించి స్వప్నాల్లో తేలిపోతూ మెట్లెక్కుతున్నారా బావగారూ ?' సాయం పట్టాడు.

రాఘవ నడుములో కలుక్కుమంది. 'వామ్మో ! నడుము విరిగిందేమో !' ఇద్దరి సాయంతో లోపలికొస్తూ నడుము తడుముకోబోయాడు. మోచెయ్యి కలుక్కు మనకుండానే మొండికేసింది. నొప్పి... విపరీతమైన నొప్పి, 'అయ్యో ... నా చెయ్యి విరిగి నట్టుంది. అమ్మో ! మెట్ల మీద అరటి తొక్కలుంటాయని కలగన్నానా ! వెధవది... రెండు కాళ్లు ... రెండు తొక్కలమీద పడి జర్రున జారింది...' కోపం, రోషం పొంగుకొస్తున్నై. రొప్పుతున్నాడు. 'అరటితొక్కలనలా పడేస్తారా ?' బాధ... నిస్సహాయత. పడుకున్న సోఫా మరణశయ్య లాగుంది. ఏడుపొస్తుంది... కాని ఏం లాభం ? చుట్టూరా మనుషులున్నారు.

ఆటోలో హాస్పిటల్‌కు తరలించారు. ఎక్స్‌రేలు తీశారు ఎక్స్‌రే ప్రింట్లను లైటు తెరపై వేసి ఎగాదిగా చూశాడు అర్థోపెడిక్ స్పెషలిస్టు.

'సారీ ! చెయ్యి విరిగింది. నడుం బాగానే ఉంది.'

కట్టుకట్టి, బెడ్డు మీదికి చేర్చారు. చుట్టూరా బంధువులు.

'పండక్కి అత్తగారింటి కొచ్చి హాయిగా ఉంటారనుకుంటే... హాస్పిటల్ పాలయ్యారు వదినా !' స్వప్నకు దుఃఖ మాగలేదు. మాధవి గుండెలమీద ఒరిగి గొల్లుమంది. మరదలినోదార్చి రాఘవ మంచమ్మీద కూచోబెట్టింది. మాధవి చూపులు మొదట స్వప్నను చుట్టేసి, అనిత తలను తట్టి అన్నపూర్ణమ్మ వైపు మళ్లాయి.

'చూశారా అత్తయ్యా ! ఈ అత్తా కోడళ్ల హంగామా ?' అంటున్నాయా చూపులు. 'ఆ అరటితొక్కల్ని మెట్లమీదికి మనమే విసిరేశాం గదా అత్తయ్యా !' కుండ బద్దలు కొట్టేసింది అనిత.

'ఛీఛీ... నా బుర్రల బూడిద నిండింది.' సిగ్గుతో నుదురు కొట్టుకుంది స్వప్న. మంచు పూలైన కళ్లను కొనకొంగుతో అద్దుకుని భర్తవైపు చూసింది. అమ్మా, నాన్న, అన్నయ్యలను చూడాలంటే భయమేసింది.

***(జలధి - 16-11-2003)***